ప్రత్యేక సండే ఈవినింగ్ టాక్ కార్యక్రమం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం రోజు ప్రత్యేక సండే ఈవినింగ్ టాక్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇది సాయంత్రం 6.40 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సాగుతుంది. ఈ సందర్భంగా ప్రత్యేకంగా రక్షాబంధన్- గెట్ టు గెదర్ అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఈ కార్యక్రమంలో భాగంగా రక్షాబంధన్ ఆధ్యాత్మిక ప్రాముఖ్యత, ధ్యాన అనుభవం, రాఖీ కట్టడం, రక్షాబంధన్ క్విజ్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు. వీటిని శాంతిసరోవర్ డైరెక్టర్ బి.కె.కుల్‌దీప్ దీదీ పర్యవేక్షిస్తారు.

మ్యాన్‌హోల్ పునఃరుద్ధరణ పనులు ప్రారంభం



సాక్షి ఎఫెక్ట్

మ్యాన్‌హోల్ పునఃరుద్ధరణ పనులు చేపడుతున్న అధికారులు

మియాపూర్: ప్రశాంత్‌నగర్ కాలనీ ప్రధాన రోడ్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్ పునఃరుద్ధరణ పనులను ఎట్టకేలకు ప్రారంభించారు. ప్రమాదరంగా గుంతలు.. ఇబ్బందులు పడుతున్న వాహనదారులు అనే శీర్షికతో ప్రత్యేక కథనం 'సాక్షి' దినపత్రికలో గురువారం ప్రచురితమైంది. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు స్పందించి మ్యాన్‌హోల్ పునఃరుద్ధరణ పనులను చేపట్టారు. దీంతో స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణ పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

రాఖీలు కట్టిన బ్రహ్మకుమారీలు



రాయదుర్గం: రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని బ్రహ్మకుమారీస్ సంస్థ మహిళలు అందరికీ రాఖీలు కట్టారు. శుక్రవారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ డిపో మేనేజర్ మురళీధర్ రెడ్డి, ఆర్టీసీ డిపో అధికారులు, ఉద్యోగులకు బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధులు మహిళలు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. అనంతరం రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా వరలక్ష్మీవ్రతం ప్రత్యేక పూజలు



జీపీఆర్ఏ క్వార్టర్స్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకుడు



రాయదుర్గంలోని ఓ ఇంట్లో వరలక్ష్మీవ్రతం నిర్వహించిన మహిళలు

సామూహిక కుంకుమార్చనలు

గచ్చిబౌలి/రాయదుర్గం: శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని కాలనీలు, బస్తీల్లోని మహిళలు శుక్రవారం శ్రావణమాస వరలక్ష్మీవ్రత పూజలు వైభవంగా జరుపుకున్నారు. ముఖ్యంగా పలు ఆలయాల్లో సామూహిక కుంకుమార్చనలను అర్చకుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాల్లో భక్తులతో సందడిగా మారాయి. ఇళ్ల కూడా మహిళలు ప్రత్యేకంగా అమ్మవారికి అలంకారం చేసి వరలక్ష్మీవ్రతం ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు.

ముదిరాజ్‌ల ముద్దుబిడ్డ సాయన్నకు ఘన నివాళి



రాయదుర్గంలో పండుగ సాయన్నకు నివాళులు అర్పించిన బీసీయువగళం నాయకుల

రాయదుర్గం: ముదిరాజ్‌ల ముద్దుబిడ్డ, తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరుగాంచిన పండుగ సాయన్నకు ఘనంగా నివాళులర్పించారు. బీసీ యువగళం ఆధ్వర్యంలో రాయదుర్గంలోని వార్డు కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి స్థానికులు నివాళులర్పించారు. బీసీయువగళం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు నీరుడి కిరణ్‌ముదిరాజ్ మాట్లాడుతూ.. పండుగ సాయన్న స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినవాడని గుర్తు చేశారు. అన్ని వర్గాల్లో ఉన్న పేద ప్రజలకు దానధర్మాలు చేసిన ప్రజానాయకుడిగా, తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరొందారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నరేందర్‌ముదిరాజ్, నీలం నరేందర్ ముదిరాజ్, సురేందర్, ప్రభాకర్, దయాకర్, దేవేందర్, సురేశ్, నర్సింగరావు, మల్లేశ్, జగదీశ్, నవీన్, కాశీవిశ్వనాథ్, వెంకటేష్, నర్సింగ్, మహేశ్ పాల్గొన్నారు.

శాంతాబయోటెక్‌లా 'బయోవరం' ఉండాలి

శాంతాబయోటెక్ వ్యవస్థాపకుడు డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి

రాయదుర్గం: వ్యాక్సిన్లను సామాన్య ప్రజలకు అందించడంలో శాంతాబయోటెక్ ఎలా ముందుందో అదే తరహాలో 'బయోవరం' కూడా ముందు ఉండాలని శాంతాబయోటెక్ వ్యవస్థాపకుడు డాక్టర్ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి సూచించారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లోని లైఫ్ సైన్సెస్ స్కూల్‌లో నూతనంగా బయోవరం పేరిట బయో మెటీరియల్ సొల్యూషన్స్‌ను ఆయన శుక్రవారం సాయంత్రం ఆవిష్కరించారు. అనంతరం బయోవరం వ్యవస్థాపకుడు డాక్టర్ జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లో తాము స్థాపించాలనుకునే ఇన్నోవేషన్ హబ్ కేవలం ప్రస్తుత అవసరాలకు మాత్రమే పరిమితం కాదన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఏబీపీ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ పల్లు రెడ్డన్న, తెలంగాణ లైఫ్ సైన్స్ ఫౌండేషన్ మెడికల్ డివైస్‌పార్కు ఉపాధ్యక్షుడు వేణుగోపాలరావు సంకినేని, భవ్య కన్‌స్ట్రక్షన్స్ డైరెక్టర్ సుధాకర్‌నల్లపనేని తదితరులు ఉన్నారు.



బయోవరంను ఆవిష్కరిస్తున్న శాంతాబయోటెక్ వ్యవస్థాపకుడు డా. వరప్రసాద్‌రెడ్డి, అతిథులు

భాగ్యలక్ష్మి ఆలయంలో భక్తుల సందడి



భాగ్యలక్ష్మి ఆలయంలో మహిళలు

రాయదుర్గం: శ్రావణ శుక్రవారం వరలక్ష్మీవ్రతం పర్వదినాన్ని పురస్కరించుకొని నానరరాంగూడలోని భాగ్యలక్ష్మి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలతో సామూహికంగా కుంకుమార్చన, భజన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

వైభవంగా లక్ష్మీనర్సింహా స్వామి కల్యాణమహోత్సవం



రాయదుర్గంలో లక్ష్మీనర్సింహాస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించిన భక్తులు

రాయదుర్గం: శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని రాయదుర్గంలోని పురాతన కాల చరిత్ర కలిగిన లక్ష్మీనర్సింహ్మాస్వామి ఆలయంలో లక్ష్మీనర్సింహాస్వామి కల్యాణమహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఆలయాన్ని పూలు, మామిడిఆకులు, విద్యుత్‌దీపాలతో ప్రత్యేక అలంకరించారు. ఉదయం నుంచి లక్ష్మీ, నర్సింహాస్వామి వారికి ప్రత్యేక అర్చనలు, పూజలు, అభిషేకాలు, అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అర్చకుల వేద మంత్రోచ్చారణల మధ్య స్వామివారి కల్యాణమహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు.

మంత్రులకు ఘన స్వాగతం



పటాన్‌చెరు టౌన్: మండలంలోని రుద్రారం సమీపంలోని తోసిబా పరిశ్రమలో శుక్రవారం నూతనంగా ఏర్పాటు చేసిన యూనిట్‌ను ఐటీ మంత్రి శ్రీధర్ బాబు, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జ్, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులకు కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్ ఘన స్వాగతం పలికారు.

రౌడీ మూకలపై చర్యలు తీసుకోవాలి

బీజేపీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి రవి కుమార్‌యాదవ్



అంజయ్యనగర్‌లో దాడి వివరాలను తెలుసుకుంటున్న బీజేపీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి

గచ్చిబౌలి: అంజయ్యనగర్‌లో అమాయక ప్రజల ఇళ్లను ఖాళీ చేయించేందుకు దాడులకు పాల్పడుతున్న రౌడీ మూకలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి ఎం.రవి కుమార్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం అంజనగర్‌లో బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. అంజయ్యనగర్‌లో రామకృష్ణ అనే వ్యక్తి ఇంటికి వచ్చి ఖాళీ చేయాలని దాడులకు పాల్పడి భయభ్రాంతులకు గురి చేశారని ఆయన ఆరోపించారు. ఫిర్యాదు చేసిన పోలీసులు సరిగ్గా పట్టించుకోవడం లేదని స్థానికు చెప్పగా.. ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు సాగర్, అరవింద్, మన్యం కొండ సాగర్, ఆత్మారాం, రాజేందర్, వెంకటేష్, నర్సింహ, ప్రవీణ్, రమేశ్ తదితరులు ఉన్నారు.

చనుబాలతో తల్లి, బిడ్డకు ఆరోగ్యం

ఫెర్నాండెజ్ ఆస్పత్రి నియోనాటాలజీ విభాగం హెడ్ డాక్టర్ తేజోప్రతాప్‌ఒలేటి



కార్యక్రమంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ఫెర్నాండెజ్ ఆస్పత్రి వైద్య బృందం

రాయదుర్గం: చనుబాలతో తల్లి, బిడ్డ ఎంతో ఆరోగ్యంగా ఉంటారని ఫెర్నాండెజ్ ఆస్పత్రి నియోనాటాలజీ విభాగం హెడ్ డాక్టర్ తేజోప్రతాప్‌ఓలేటి పేర్కొన్నారు. నగరంలోని ఫెర్నాండెజ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో బ్రెస్ట్ ఫీడింగ్ వీక్ కార్యక్రమం ముగింపు సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారం రోజులపాటు ప్రచారాన్ని నిర్వహించి వైద్యులు, నర్సులు, మంత్రసానులు, ఫిజియోథెరపిస్టులతో పాటు కన్సల్టెంట్లు కూడా వీడియో సిరీస్ ద్వారా కీలక సందేశాన్ని ప్రచారం చేశారు. అనంతరం పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేసి, తల్లిపాలు ఇవ్వడంపైన అపోహాలు, వాస్తవాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ అధికారులు, ఫెర్నాండెజ్ ఆస్పత్రి వైద్య బృందం పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే ఉద్యోగ అవకాశాలు

పటాన్‌చెరు టౌన్: కాంగ్రెస్ హయాంలోనే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వచ్చాయని, ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జపాన్ పర్యటనతో తోషిబా పరిశ్రమలో పెట్టుబడులు వచ్చాయని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి పేర్కొన్నారు. పటాన్‌చెరు మండలం రుద్రారం తోషిబా పరిశ్రమలో శుక్రవారం నూతన ప్లాంట్ ఆవిష్కరణలో పాల్గొన్న కార్మిక శాఖ మంత్రి వివేక వెంకట స్వామి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబును ఐఎన్‌టీయూసీ నాయకులు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ..జిల్లాలో వేలాది పరిశ్రమల ఏర్పాటు, లక్షలాది కార్మికుల జీవనోపాధి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే జరిగిందన్నారు.